కథ

భమరాజు వెంకటరమణ

# భాను'మతి' మారింది

"చెప్పండి ఏమిటి మీ ప్రాబ్లం" అడిగాడు మానసిక వైద్యుడు సాంబమూర్తి ఎదురుగా చేతులు నలుపుకుంటూ కూర్చున్న యువకుడితో.

"ప్రాబ్లం నాకు కాదండి మా ఆవిడకు"

"ఏమైయింది మీ ఆవిడకు?"

"ఆమె ప్రకృతికి విరుద్ధంగా ఉంటుంది సార్"

"అంటే ఆమె వికృతంగా వికారంగా ఉంటుందా లేక ఏదైనా అంగవైకల్యానికి సంబంధించిన ఇబ్బందా?" అడిగాడు డాక్టర్.

"అలాంటిదేమీ కాదు సార్!" అన్నాడతను.

"మరేమిటయ్యా చెప్పు" కాస్త విసుగు కనపరిచాడు డాక్టర్.

"మరి ఏమిటంటే..." అని నీళ్ళు నమలటం, బుర్రగోక్కోవటంలాంటివి చేస్తున్నాడతను.

"ఏమయ్యా! నువ్వు సరిగా మాట్లాడి విషయం చెబుతావా, లేకపోతే నీకే ముందు షాక్ ట్రీట్మెంట్ మొదలుపెట్టమంటావా?" గర్జించాడు డాక్టర్.

కాసేపైతే నిజంగానే ఆ పని చేస్తాడని అనిపించి అతను చెప్పడం మొదలుపెట్టాడు. "నా పేరు శ్రీనివాస్ సార్! నా భార్య పేరు భానుమతి, మాకు వివాహం అయి సంవత్సరం దాటింది. నేను ఒక గవర్నమెంట్ ఆఫీస్‌లో పనిచేస్తున్నాను. ఆమేమో హౌస్ వైఫ్" అని చెపుతుండగా "ఆపవయ్యా! ఆపు! ఇందాకేమో సరిగా మాట్లాడలేదు, ఇప్పుడేమో ఏదో సోది చెబుతున్నావు, అసలు సంగతేమిటో చెప్పు" అన్నాడు సాంబమూర్తి మొహం విసుగ్గాపెట్టి.

"వస్తున్నా సార్! అసలే ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు దయచేసి తొందర పెట్టకండి" అన్నాడు శ్రీనివాస్.

"సరే! చెప్పు! అవతల నాకు అర్జంటుగా బజారు పోయే పనుంది" అన్నాడు కాస్త ఓపిక కనపరుస్తూ.

"మరేమో! నా భార్య అందరిలా ప్రవర్తించదు సార్! అదే నా బాధ" అన్నాడు నేలవైపు చూస్తూ.

డాక్టర్‌కి అరికాలు మంట నెత్తికెక్కింది "ఓరి మగడా! నీతో చచ్చే చావొచ్చిందిరా నాయనా! ఇవాళ వచ్చి నా మెదడు తింటున్నావు" అని పళ్ళు పటపట కొరికాడు.

వెంటనే శ్రీనివాస్ "చూసారా సార్! ఇది సాధారణంగా మనుషులు ప్రవర్తించే తీరు, మరి నా భార్య ఉలకదు, పలకదు, మహా మిత భాషి, అడిగినదానికి ఒక్క ముక్కలోనే సమాధానం చెబుతుంది. నాతో గానీ, ఇరుగుపొరుగు వారితోగానీ ఏ గొడవ పెట్టుకోదు, వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి నా గురించి చెప్పడం లేదా వాళ్ళనైనా మా ఇంటికి పిలిచి వాళ్ళ విషయాలు అడగటం చెయ్యదు. కనీసం పనిమనిషి సరిగా రాకపోయినా తిట్టదు, మా బంధువులు వచ్చినప్పుడైనా వాళ్ళతో వాదన పెట్టుకొని చిన్న సీన్ అయినా క్రియేట్ చెయ్యదు, పోనీ టీవీ సీరియల్స్ ఎక్కువగా చూసి ఆ పాత్రలు ఆవహించుకొని నాతో లా పాయింట్లు మాట్లాడటం అసలే లేదు.

ఏమి చెప్పినా గంగిరెద్దులా తలాడిస్తుంది. అట్లా కాదు ఇట్లా అని ఒక్కసారి కూడా అనదు. సాటి గృహిణులకు విరుద్ధంగా ఉంటుంది సార్! ఒక అచ్చటా లేదు. ఒక ముచ్చటా లేదు. చిన్న చిన్న గొడవలు, వాదనలు, అలగడాలూ లాంటివి లేకుండా ఏమిటి సార్? చప్పగా ఈ జీవితం? నాకు పిచ్చెక్కేట్లుంది డాక్టర్! మీరు కనుక ఆమెలో మార్పు తెస్తానంటే మీ దగ్గరికి తీసుకొస్తా" అని ముగించాడు ఆయాసపడుతూ.

సాంబమూర్తి శ్రీనివాస్‌ని పైకి క్రిందికి ఎగాదిగా చూసి "కాంపౌండర్! త్వరగా ఇలా రా! ఇతన్ని కుర్చీకి ఫిక్స్ చెయ్యి, అర్జంటుగా రెండు, మూడు షాకులైనా ఇవ్వాలి" అన్నాడు గుడ్లు మిటకరిస్తూ.

"సార్! సార్! అదేమిటి సార్! మధ్యలో నాకు షాకులు ఇచ్చేదెందుకు సార్" అడిగాడు నిజంగా ఆ పని చేస్తాడేమో అని భయపడిపోతూ.

"లేకపోతే ఏమిటయ్యా? నీకు మతి స్థిమితంగా లేదని నీ మాటల్లోనే అర్థమవుతున్నది. ఉలుకు పలుకు లేకుండా ఉంటూ చక్కగా చాకిరీ చేసి పెడుతున్న ఇల్లాలుకు మతి సరిగా లేదంటావా? అసలు నిన్ను హాస్పిటల్ నుండి బయటికే పోనివ్వకూడదు" అన్నాడు డాక్టర్ కళ్ళు వీలైనంత పెద్దవి చేస్తూ.

"అది కాదు సార్! నేను చెప్పేది వినండి. సెలయేరు శబ్దం లేకుండా ప్రవహిస్తుంటే ఏమి బావుంటుంది? అదే కొండల మీద నుండి దూకుతూ, వంకరలు తిరుగుతూ, శబ్దాలు చేస్తూ పోతుంటేనే కదా ఆనందం? అలాంటిదే కదా సంసారం?" అన్నాడు శ్రీనివాస్ మందహాసంతో.

'ఓరి వీడి కవి హృదయం కాకులెత్తుకెళ్ళా! వీడికి వెర్రి బాగానే ముదిరింది. నా ఇరవై ఏళ్ళ సర్వీసులో ఇలాంటి వాడిని చూడలేదు' అనుకొని "చూడు మిస్టర్ శ్రీనివాస్! నా భార్య కనుక నీ భార్యలాగా ఉండి ఉంటే, ఇల్లు వాకిలి అమ్మి చివరికి తల తాకట్టు పెట్టి అయినా సరే ఒక బంగారు కిరీటం చేయించి ఆమెకు పెట్టి, రోజూ హారతులిచ్చేవాడినయ్యా! నీకు ఆమె విలువ తెలియక కుర్రతనంతో వెర్రివెర్రి ఆలోచనలతో ఇలా తయ్యారయ్యావు. అసలు నీకు దాంపత్య జీవితం గురించి ఏమి తెలుసు?" అని ఆవేశంగా మాట్లాడుతుండగా ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"అయ్యో! డాక్టరుగారు! నా సంసారం గురించి మీరు అంతగా ఆలోచించి బాధపడుతున్నారా? చాలా థాంక్స్!" అన్నాడు కృతజ్ఞతా పూర్వకంగా.

"నీ సంసారం గురించి కాదయ్యా! నా సంసారం గుర్తొచ్చి" అన్నాడు రుమాలుతో కళ్ళు తుడుచుకుంటూ.

"కాస్త వివరంగా చెబుతారా?" కుతూహలంగా అడిగాడు శ్రీనివాస్.

"చూడు బాబూ! నీ ఉద్దేశ్యంలో సంసారంలో చిన్న చిన్న గొడవలు ఉండకపోతే బావుండదు, చప్పగా ఉంటుంది. నీ తోటి ఉద్యోగస్తులు, స్నేహితులు వాళ్ళ గొడవలు గురించి మాట్లాడుకుంటూ ఉంటే నువ్వు మాత్రం నోటికి ఇంటూ మార్కు వేసుకొని కూర్చోవలసి వస్తున్నది అనే కదా నీ బాధ?" అడిగాడు.

"అవును సార్! అదే అదే!" అని ముఖం వెలిగిపోయింది.

"ఆ చిన్న చిన్న తగాదాలు గొడవలు అంతటితో ఆగవు నాయనా! తరువాత మొదలవుతుంది అసలు కథ కాదు వ్యథ. అలాంటివి నీ స్నేహితులు నీకు చెప్పరు, ఫలానా వాడి భార్య వాడిని అప్పడాల కర్రతో కొట్టింది అనగానే నవ్వుకోవడానికి బాగానే ఉంటుంది. కానీ ఆ సంఘటన జరిగినప్పుడు దెబ్బతిన్నవాడికి తెలుస్తుందయ్యా అసలు బాధ!" అన్నాడు ఏదో సంఘటన గుర్తుతెచ్చుకుంటూ.

"ఇంతకూ మీరనేది ఏమిటి? నా సమస్యకు పరిష్కారం చూపుతారా లేదా?" నిలదీసాడు శ్రీనివాస్.

"నీ ఖర్మ! ఎవరి నుదిటి రాతకి ఎవడు బాధ్యుడు?"

"నాకు అర్థం కాలేదు"

"మా ఇంటికి వస్తావా?"

"ఎందుకు?"

"ప్రాక్టికల్స్, అంటే లైవ్ ప్రోగ్రాం చూపిస్తా!"

"కాస్త అర్థం అయ్యేట్లు చెప్పండి సార్"

"నీ భార్య ప్రకృతి విరుద్ధంగా ఉన్నది అన్నావుగా?" అసలు వికృతి అంటే ఎలా ఉంటుందో చూపిస్తా రా!"


"చూస్తాను సార్!" సంబరంగా అన్నాడు శ్రీనివాస్ ఏదో ఐమాక్స్‌లో సినిమా చూపిస్తా వస్తావా అని అడిగినట్లు.

"సరే! ఈ కాగితాలు మీద సంతకాలు పెట్టు" అడిగాడు డాక్టర్.

"సంతకాలు దేనికి?"

"దేనికేమిటయ్యా! ఏదైనా గనులు, క్వారీలు చూడాలని వెళ్ళినప్పుడు అక్కడ ఉన్న అధికారులు మన చేత కొన్ని కాగితాల మీద సంతకాలు చేయించుకుంటారు 'నాకు గనులు చూడాలని కలిగిన దురద వలన లోపలికి వెళుతున్నాను, ఒకవేళ పై కప్పు కూలి మీద పడి నేను లోపలే హరీ అంటే వీళ్ళకేమీ సంబంధం లేదు' అని"

"అంటే మీ ఇంటికి వెళ్ళడం?"



"అవును నాయనా! వెళ్ళడం వరకే మన పని తిరిగి రావడం మన చేతుల్లో లేదు" చెప్పాడు డాక్టర్.

"అర్థం అయ్యేట్లు చెప్పరూ?"

"మరేం లేదు బాబూ! మా ఆవిడకు చిరాకు పుట్టిందంటే ఏ చేత్తో దేనిసైనా విసరగలదు. ఎప్పుడూ ఆమె అయిదారు ఫ్లవర్‌వేజులు అందుబాటులో ఉండేట్లు చూసుకుంటుంది, పైగా ఆమెకు గురి తప్పిన దాఖలాలు ఇప్పటివరకూ లేవు" అన్నాడు తలలో ఎక్కడో తడుముకుంటూ.

"పొండి సార్! మీరు మరీ విడ్డూరంగా మాట్లాడతారు. నాలాంటి క్రొత్తమనిషి ఇంటికి వచ్చినప్పుడు మేడమ్ అలా ఎందుకు ప్రవర్తిస్తారు?" మేధావిలా అన్నాడు శ్రీనివాస్.

మాటల్లోనే డాక్టర్‌గారి ఇల్లు వచ్చేసింది. ఏదో ప్రాజక్ట్ వర్కు మీద వేరే రాష్ట్రానికి వెళ్ళినవాడిలా కారు దిగి అటూ ఇటూ చూస్తున్నాడు శ్రీనివాస్.

డాక్టర్ కాలింగ్ బెల్ నొక్కగానే తలుపు తీసిన అతని భార్య చాముండేశ్వరి అతని చేతులు వైపు చూసి "ఫంక్షన్‌కి వెళ్ళాలి గిఫ్ట్ కొనుక్కొని రమ్మన్నానుగా తీసుకురాలేదా?" అంది కళ్ళు పెద్దవి చేస్తూ. అప్పుడు అర్థమయింది సాంబమూర్తికి ఇందాకటి నుంచి తను మర్చిపోయాను అనుకుంటున్న విషయం ఏమిటో. కొత్తరకం సమస్యతో శ్రీనివాస్ రావడం, అందులో బాగా లీనమైపోవడం ఆ మర్చిపోవడానికి అసలు కారణం.

చాముండేశ్వరి మొదలుపెట్టింది "ఏ ఒక్కపనైనా సరిగా చేసావుటయ్యా! నీకే బుర్ర సరిగా పనిచెయ్యదు ఇక జనానికి నువ్వు వైద్యం చెయ్యటం ఏమిటో?" అన్నది చేతులు తిప్పుతూ, ఆ ఏకవచన సంభాషణ వినేసరికి శ్రీనివాస్‌కి అర్థం అయింది ఆ ఇంట్లో డాక్టర్ సాంబమూర్తిగారి స్టేటస్.

"ఈయన ఎవరు?" అడిగింది ముఖం కాస్త చిరాకుగా పెడుతూ.

"ఇతను నా పేషెంటు భర్త" అన్నాడు డాక్టర్ కాస్త తత్తరపాటుతో.

"అయితే" అడిగింది, ఇంటికి ఎందుకు తీసుకొచ్చారు అనే అర్థం కూడా ఆ "అయితే"లో ఉంది.

"ఏమయింది మీ భార్యకు?" శ్రీనివాస్‌ని అడిగింది.

ఈసారి తత్తరపాటు శ్రీనివాస్ వంతు అయింది.

"అంటే! అది! మా ఆవిడ కాస్త స్తబ్దతగా మందకొడిగా ఉంటుంది" అందుకని అని ఇక ఏమి

చెప్పాలో అర్థంకాక ఆగిపోయాడు.

చాముండేశ్వరి శ్రీనివాస్‌ని ఒకసారి పైకీ క్రిందకీ చూసి లోపలికి వెళ్ళిపోయింది.

ఇద్దరూ ఊపిరి పీల్చుకున్నారు. "అయినా మీరెందుకు సార్! మేడమ్ అంటే మరీ అంతగా భయపడిపోతున్నారు, ఆమె కూడా అందరిలాగా సాధారణ హౌస్ వైఫే కదా!" అన్నాడు శ్రీనివాస్.

"ఆమె వైఫేనయ్యా! కానీ ఆమె అన్న పెద్ద నైఫ్ దాదా కమ్ రాజకీయ నాయకుడు. అదే ఆమె బలం నా దుర్బలం"

"అంటే మీరెప్పుడూ నోరు తెరిచి గట్టిగా ఆమెతో మాట్లాడరా?" కుతూహలంగా అడిగాడు శ్రీనివాస్.

ఇంత కాలానికి తన బాధలు పంచుకునే ఆప్తుడు దొరికినట్లయింది సాంబమూర్తికి. "ఎందుకు మాట్లాడలేదు! ఒకసారి ఏమైయిందో తెలుసా? ఒక పార్టీలో కాస్త తీర్థం పుచ్చుకొని అసలు సిసలు మగాడిలా మాట్లాడటం మొదలుపెట్టా. ఆ స్థితిలో కాస్త ఎగ్జంషన్ ఉంటుంది కదా, అని అంతే! నా చిటికినవేలు మీద తన హైహీల్స్ చెప్పుతో గట్టిగా తొక్కి, నేను గావుకేక పెట్టగానే నాకేదో అయిందని అక్కడ అందరినీ నమ్మించి కార్లో పడేయించి ఇంటికి పంపింది. అప్పటి నుంచి నా ఎడమకాలి చిటికిన వేలు నిర్జీవమైపోయింది. చూస్తావా?" అడిగాడు సాంబమూర్తి.

"ఫరవాలేదు మీ మాట నమ్ముతానులెండి! అయినా ఇన్ని విపరీతమైన కష్టాలు పడుతూ కాపురం చేసే కంటే దర్జాగా విడాకులు తీసుకొనిపోవచ్చు కదా సార్?" ఫోజు కొడుతూ అడిగాడు శ్రీనివాస్.

"గట్టిగా మాట్లాడకు నాయనా! నీకు పుణ్యం ఉంటుంది. అలా ప్రయత్నిస్తే నా వేలుకి పట్టిన గతే నాకు పడుతుంది. అది సరే! ఇంత మంచి ఐడియా నీ దగ్గర పెట్టుకొని నా దగ్గరకు వచ్చావేమిటయ్యా? ఇదే ఆయుధం మీ ఆవిడ మీద ప్రయోగించు" ఏదో క్లూ దొరికినట్లు అన్నాడు సాంబమూర్తి.

శ్రీనివాస్ ఆ మాటకి కాస్త ఆలోచనలో పడ్డాడు. నిజమే! ఇప్పటివరకూ ఎన్ని రకాలుగానో భార్యని కసురుకున్నాడు గానీ విడాకులు అనే బెదిరింపు ప్రయోగించలేదు. నిజానికి అతనికి భార్య అంటే ఇష్టమే. అతనికి కావలసింది విడాకులు కాదు ఆమెలో మార్పు. "ఏమో సార్! ఏమి చేసినా ఆమెలో మార్పు వస్తుందని నాకు నమ్మకం లేదు. అయినా ఆ ప్రయత్నం కూడా చేసి రేపు హాస్పటల్‌కి వచ్చి ఏ సంగతి చెబుతా, వెళ్ళొస్తా" అంటూ సాంబమూర్తికి కరచాలనం చేసి వెళ్ళిపోయాడు.

మరునాడు ఉదయం ఒక ఫోన్‌లో ఏదో వార్త విన్న డాక్టర్ సాంబమూర్తి హడావిడిగా తన హాస్పటల్ ప్రక్కవీధిలోనే ఉన్న మరో హాస్పటల్‌కు వెళ్ళాడు.

తలకు కట్టుతో ఉన్న శ్రీనివాస్ స్పృహలోనే ఉన్నాడు. "ఏమైయింది శ్రీనివాస్? తలకు ఆ దెబ్బ ఏమిటి?" అంటున్నప్పుడు అతని ఆలోచనలు వేగంగా కారణాలు వెతికాయి "కొంపతీసి నిన్న సాయంత్రం అనుకున్న విడాకుల ఐడియా ఫలితం కాదు కదా?" అడిగాడు ఆతృతగా.

శ్రీనివాస్ డాక్టర్ని కౌగలించుకొని భోరుమన్నాడు. "ఊరుకో! ఊరుకో!" అని వీపుమీద తడుతూ "ఇంతకీ నీ మీద దాడికి ఉపయోగించిన ఆయుధం ఏమిటి?" అడిగాడు.

"ఫ్లవర్‌వేజ్" అన్నాడు శ్రీనివాస్ నీరసంగా.

సాంబమూర్తి ఆలోచనలు మళ్ళీ గిరగిరా తిరిగాయి. "యస్! నాకు ఇప్పుడు అర్థమయింది మిస్టర్ శ్రీనివాస్! నిన్న మా ఆవిడ నిన్ను ఎగాదిగా చూసి ఏమి అనకుండానే వెళ్ళిపోయినప్పుడు ఆశ్చర్యపోయా, రాత్రి పార్టీకి వెళ్ళి వస్తున్నప్పుడు ఒక నిముషం ఏదో పనుండి మా హాస్పటల్‌కి వెళ్ళాం, అప్పుడు నా టేబుల్ మీద మీ ఆవిడ కోసం నువ్వు చేసిన పేషెంట్ రిజిస్ట్రేషన్ కార్డు మా ఆవిడ కంట పడింది, కాసేపు దానిని పరిశీలనగా చూసింది. బహుశా దానిలోని మీ ఇంటి ఫోన్ నంబరు గుర్తుపెట్టుకొని ఉంటుంది, నేనూ పెద్దగా పట్టించుకోలేదు, నిన్ను మా ఇంటికి తీసుకెళ్ళిన కారణం కూడా పసిగట్టి ఉంటుంది. అందుకే నీకు నాకు కూడా బుద్ధి చెప్పాలని మీ ఇంటికి ఫోన్ చేసి మీ ఆవిడకు ట్రైనింగ్ ఇచ్చి ఉంటుంది. ఎందుకంటే ఫ్లవర్‌వేజు ప్రయోగం అలవాటు మా ఆవిడదే కదా!" తన మేధాశక్తిని అంతా ఉపయోగించి విషయాన్ని ఊహించి చెప్పగలిగాడు. "ఏది ఏమైనా ముందే పసిగట్టి నీకు జాగ్రత్త చెప్పలేకపోయాను. సారీ! శ్రీనివాస్!" అన్నాడు డాక్టర్ దీనంగా మొహం పెట్టి.

శ్రీనివాస్ డాక్టర్ని మళ్ళీ కౌగలించుకున్నాడు. అతనికి పరిస్థితి అర్థం కావడం లేదు. భార్యలో మార్పు వచ్చినందుకు సంతోషించాలా? ఆ మార్పు మరీ విపరీతంగా వచ్చినందుకు చింతించాలా? ఒక వేళ ఈ మార్పే కనుక రోజూ కొనసాగితే ఏమి చెయ్యాలి? మిశ్రమ స్పందనతో అతని ముఖం అయోమయంగా ఉంది.

డాక్టర్ అతని వీపుపైన నిమురుతూ అనుకుంటున్నాడు 'పాపం! ప్రకృతి, వికృతి అనుకుంటూ, తన భార్యను పేషెంట్‌గా చేర్చాలని వచ్చి తను పేషెంట్‌గా మారిపోయాడు. ఏది ఏమైనా తన లాంటి మందభాగ్యుడు ఈ ఊర్లో మరొకడు తయారయ్యాడు' అని అతనిని గుండెకు హత్తుకొని వీపుమీద నిమిరాడు.

## కొత్త డాన్ బాలకృష్ణ?

హిందీలో వచ్చిన 'అమితాబ్ డాన్'ని అప్పట్లో ఎన్టీఆర్‌తో 'యుగంధర్' పేరిట రీమేక్ చేసారు. ఇటీవల హిందీలో షారుఖ్ హీరోగా మళ్లీ 'డాన్' రీమేక్ అయింది. పాత డాన్ కథనే తీసుకుని అక్కడక్కడా మార్పులు చేసి దీన్ని నిర్మించారు. ఇప్పుడీ కొత్త డాన్‌ని బాలకృష్ణతో తీయాలని అనుకుంటోందిట ఓ చిత్రనిర్మాణ సంస్థ. దీనికి పి.వాసు దర్శకత్వం వహించే అవకాశాలున్నాయి. అసలు జూనియర్ ఎన్టీఆర్‌తోనే ఈ కొత్త డాన్‌ని తీయాలని వాసు ఆమధ్య అనుకున్నట్టు అది ఫలప్రదం కాక ఇప్పుడు బాలకృష్ణతో ట్రయ్ చేస్తున్నట్టు వినికిడి.

